హైదరాబాద్ వార్త



# ప్రామాణికంగా..
# తెల్లరేషన్ కార్డు

రేషన్‌కార్డులను కోల్పోయిన వారు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడాశను పెట్టుకున్నారు. కొన్ని నెలలు బియ్యం తీసుకోలేదనే సాకుతో తొలగించిన కార్డులను పునరుద్ధరించాలని కోరుతున్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన రేషన్‌కార్డులు కార్డులు మాత్రమే కాకుండా దాదాపు 15 సంవత్సరాలుగా మరెంతమందికి పేదలకు తెల్లరేషన్ కార్డుల డిమాండ్ ఉందో ఊహించుకోవచ్చు.

**హైద్రాబాద్ నగరంలో ప్రస్తుతం దాదాపు 45లక్షల కుంటుంబాలు ఉండగా బీపీఎల్ కింద 27లక్షల కుటుంబాలు ఉన్నాయని అధికారుల అంచనా. వీటిలో కేవలం సగంమందికి మాత్రమే తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అందించాలననుకుంటున్న అభయవాస్తం పథకాలు తెల్లరేషన్ కార్డుదారులకు మాత్రమే అన్నట్లుగా ఉన్నాయి. తాజాగా తెల్లరేషన్ కార్డుల కోసం తరఖాస్తులు చేసుకోవాలని సూచించిన ప్రభుత్వం కార్డుల జారీకి ఎప్పుడు ఆదేశిస్తుందో చూడాలి.**

బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుల ఏరివేత..
బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంది. హైద్రాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా తెల్లకార్డులను తగ్గించాలనే లక్ష్యంతో అర్హుల రేషన్‌కార్డులను కూడా లక్షల సంఖ్యలో ఏరివేసింది. దీనికి పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా అత్యుత్సాహం చూపించి చిన్నచిన్న సాకులు చూపించి కార్డులు ఏరివేయడంతో ప్రజలు అప్పటి నుంచి కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

**అభయవాస్తం పథకాలకు తెల్లరేషన్ కార్డు ప్రామాణికం**
**తెల్లరేషన్ కార్డులకు పెరుగుతున్న డిమాండ్**
**గతంలో కుంటిసాకులతో కార్డులు తొలగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**
**సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా పట్టించుకోని అప్పటి ప్రభుత్వం**
**బీఆర్ఎస్ తొలగించిన వాటిని కూడా పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు**

హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హతగా తెల్లరేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుంటోంది. బీపీఎల్ కుటుంబాలకు చిహ్నంగా మారనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత దారిద్ర రేఖకు దిగువనున్న కుటుంబాలుగా తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారినిగి గుర్తించనున్నట్లు స్పష్టమవుతోంది. నిరుపేద కుటుంబాలకు ఆరు గ్యారెంటీలు (అభయహస్తం) తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి మాత్రమే అమలుపర్చనున్నట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేద కుటుంబాల కోసం అమలు జరుపనున్న ఆరు గ్యారెంటీలు (అభయహస్తం) పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, యువ వికాసం, మహాలక్ష్మీ, రైతు భరోసా, చేయూత పథకాలు తెల్లరేషన్ కార్డుతో ముడిపడి ఉన్నాయి. ఇందులో రైతు భరోసా మాత్రం కేవలం రైతులకు వర్తించనుండగా మహాలక్ష్మీ మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అందరు మహిళలకు ప్రస్తుతం వరిస్తోంది. హైద్రాబాద్ నగరంలో గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలు వర్తించనున్నయి. ఈ పథకాల అమలు కోసం పేదలు లబ్దిపొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించగా డిసెంబర్ 28 నుండి ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే తెల్లరేషన్ కార్డుల దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులోనే సమగ్ర కుటుంబ సర్వే మాధిరిగా అన్ని వివరాలతో కూడి ఉంది. ఈ దరఖాస్తు ద్వారానే అరు గ్యారెంటీలకు సంబంధించిన లబ్దిదారులను గుర్తించే విధంగా వివరాలు సేకరిస్తున్నారు. దాదాపు 10 సంవత్సరాలుగా కేవలం బియ్యం తీసుకోడానికి మాత్రమే ఉపయోగపడిన రేషన్ కార్డు తాజాగా అభయహస్తం పథకాలు వర్తించే విధంగా తెల్లరేషన్ కార్డు మారనుంది. దీంతో తెల్లరేషన్ కార్డుకు ప్రధాన్యాత పెరగనుంది. దీంతో దరఖాస్తు దారులు కూడా, తెల్ల రేషన్ కార్డు లేనివారు తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. డిసెంబర్ 28 దరఖాస్తు దారులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అభయహస్తం కోసం 7లక్షల46వేల414 దరఖాస్తు చేసుకోగా కేవలం హైద్రాబాద్ నగరంలోనే మొదటి రోజు 88వేల 343 దరఖాస్తులు అందాయి. ఇందులో అత్యధికంగా తెల్లరేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. దీన్నిబట్టి తెల్లరేషన్ కార్డులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించవచ్చు.

గ్రేటర్ హైద్రాబాద్‌లో తెల్లరేషన్ కార్డుల సంఖ్యను బీఆర్ఎస్ (అంతకు ముందు టీఆర్ఎస్) ప్రభ్తువం భారీగా తగ్గించింది. ప్రభుత్వం దాదాపు 10 సంవత్సరాల పాటు కొనసాగినా తెల్లరేషన్ కార్డులను మాత్రం పెంచకపోవడంతో పాటు తగ్గించడానికి తీవ్రంగా ప్రయత్నించింది. హైద్రాబాద్,రంగారెడ్డి,క మెడ్చల్ జిల్లాల్లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులను పెద్దయెత్తున అంద జేసింది. పై మూడు జిల్లాలతో కూడిన హైద్రాబాద్ నగరంలో 17లక్షల 21వేల 994 తెల్లరేషన్ కార్డులు ఉండేవి. ఇందులో 1లక్షా 20వేల కార్డులు తెలంగాణ ప్రభుత్వం అందజేసింది. వీటిని ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతో సమస్యలు ప్రారంభం అయ్యాయి.

**బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుల ఏరివేత..** బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుల ఏరివేతకు పూనుకుంది. హైద్రాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా తెల్లకార్డులను తగ్గించాలనే లక్ష్యంతో అర్హుల రేషన్‌కార్డులను కూడా లక్షల సంఖ్యలో ఏరివేసింది. దీనికి పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా అత్యుత్సాహం చూపించి చిన్నచిన్న సాకులు చూపించి కార్డులు ఏరివేయడంతో ప్రజలు అప్పటి నుంచి కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

**రేషన్ షాపుల్లో పురుగులు పట్టిన బియ్యం..** తెల్లరేషన్ కార్డులను తొలగించే క్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం మూడు నెలల పాటు బియ్యం తీసుకోని వారి రేషన్ కార్డులను కూడా తొలగించారు. పాడైపోయిన, పురుగు పట్టిన బియ్యం రేషన్ షాపులలో అందజేయడం వల్ల కొందరు బియ్యం తీసుకోడానికి ఇష్టపడలేదు. దీంతో వారి రేషన్ కార్డులు అధికారులు తొలగించారు. లక్షల మందికి ముందుగా ఎలాంటి సమాచారం లేకుండానే కార్డులను తొలగించారు. రేషన్ షాపులకు వెళ్లిన వారికి మీ రేషన్‌కార్డు తొలగించారని తెలిపారు. అధికారుల వద్దకు వెళితే విచారణ జరపుతామని సాకులు చెప్పి పంపించేవారు. ఇలా తెలంగాణ ప్రభుత్వం రాకముందు హైద్రాబాద్ నగరంలో 6లక్షల 91వేల 618 రేషన్‌కార్డులు ఉండగా ప్రభుత్వం తొలగించిన తరువాత ఇప్పుడు 6లక్షల 39వేల 609 తెల్లరేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. కేవలం హైద్రాబాద్‌లోనే 52వేల 9 తెల్లరేషన్ కార్డులను తొలగించారు. కొంతమందికి మూడంతస్థుల భవనాలు, కిరాయిలు తీసుకుంటున్న వారి రేషన్‌కార్డులు మాత్రం నేటికి కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**సుప్రీంకోర్టు ఆదేశించినా.. కార్డుదారులకు నోటీసులు ఇవ్వకుండానే..**
2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 21లక్షల 94వేల రేషన్‌కార్డులను రద్దు చేసింది. ఈ వ్యవహారంపై సుప్రిం కోర్టులో పిల్ దాఖలవడంతో 2022 ఎప్రిల్ 27న విచారణ జరిపింది. రేషన్‌కార్డుదారులకు కనీసం సమాచారం లేకుండా దాదాపు 22 లక్షల కార్డులను ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా 17 అంశాలకు సంబంధించి విచారణ జరిపి నోటీసులిచ్చి రేషన్‌కార్డులను తొలగించినట్లు కోర్డుకు వివరణ ఇచ్చింది. దీంతో పాటు కొందరు రేషన్ డీలర్ల వద్ద వందల సంఖ్యలో తెల్లకార్డులు ఉన్నట్లుగా తెలియజేసింది. సుప్రింకోర్డు ఈ వాదనను తోసిపుచ్చింది. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, కార్డుదారులు వారి అర్హతను నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండా 22లక్షల కార్డులను తొలగించడం సరైన విధానం కాదని సుప్రింకోర్డు స్పష్టం చేసింది. తిరిగి క్షేత్రస్థాయిలోనే సర్వే జరిపి అర్హులందరికి తిరిగి రేషన్ కార్డులను పునరుద్ధరించలని ఆదేశించింది. ఈ క్రమంలోనే పౌరసరఫరా అధికారులు తూతూ మంత్రంగా సర్వే జరిపి అతితక్కువ సంఖ్యలో పాత రేషన్ కార్డులను పునరుద్ధరించింది. లక్షల సంఖ్యలో కార్డులను తొలగించి కేవలం వేల సంఖ్యలోనే కార్డులను అందజేసినట్లు సమాచారం. పౌరసరఫరాల శాఖ అధికారులు హైద్రాబాద్ నగరంలో అయితే మరీ దారుణంగా వ్యవహరించారు. విచారణ జరిపినట్లు చూపించి కేవలం వందల తెల్లరేషన్ కార్డులను పునర్దుదరించారు.

**సుప్రిం కోర్డు సూచించిన మార్గదర్శకాలు..** రద్దయిన రేషన్ కార్డుల వెరిఫికేషన్‌కు కొన్ని మార్గదర్శకాలను సుప్రింకోర్టు సూచించింది. రద్దయిన రేషన్‌కార్డుల జాబితాను అన్ని రేషన్‌షాపులు వద్ద ప్రదర్శించాలి. చాలా వరకు కిరాయికి ఉంటారు కాబట్టి కార్డుదారుల చిరునామా మారితే వారికి అధికారులు నోటీసులను పోస్టుద్వారా పంపాలి. కనీసం ఫోన్ నెంబర్‌లను సేకరించి సమాచారం అందించాలి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం జరపాలి. కార్డుదారులు అధికారులను సంప్రదిస్తే వారి వివరాలను సేకరించాలి. కార్డులు రద్దయితే ఇందకు సంబంధించిన కారణాలు కూడా నమోదు చేయాలి. ఇలా పలు మార్గదర్శకాలను సూచించింది. ఎలాగైనా కార్డుదారులకు సమాచారం ఇచ్చిన తరువాతే, వారి దృష్టికి తీసుకు వచ్చిన తరువాతే కార్డులను రద్దు చేయాల్సి ఉండగా అధికారులు మాత్రం కోర్టు సూచనలను ఏమాత్రం పాటించకుండానే పనికానిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

# చుక్కేసి.. చిక్కారు



**మూడు కమిషనరేట్లలో**
**3000కు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**
**పోలీసులు ఎంత హెచ్చరించినా మారని డ్రంకన్ డ్రైవర్లు**

న్యూఇయర్ రోజున నెత్తురోడిన రహదారులు..
కొత్త సంవత్సరం వేడుకల వేళ పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు కొన్ని కుటుంబాల్లో విషాదం నింపాయి. పోలీసులు న్యూ ఇయర్ రోజున ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పలు చోట్ల ప్రమాదాలు పలువురి ప్రాణాలు బలి తీసుకున్నాయి. న్యూ ఇయర్ రోజున ఆ కుటుంబాలకు తీరని దు:ఖాన్ని మిగిల్చాయి.

హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త : చుక్కేసి బండి ఎక్కారో.. చుట్టేస్తామని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు ఎంత వారించినా డ్రంకన్ డ్రైవర్లు పెడచెవిన పెట్టారు. న్యూఇయర్ పురస్కరించుకొని గ్రేటర్‌లో మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో జరిగాయి. న్యూ ఇయర్ వేళ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా అలాగే నమోదయ్యాయి.మద్యం తాగి వాహనాలు నడపొద్దని పోలీసులు ఎంతగా హెచ్చరించినా మనోళ్లు పెడచెవిన పెట్టారు. నగర పరిధిలో ఆదివారం అర్థరాత్రి వరకు 3000 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,243 కేసులు నమోదయ్యాయి. అలాగే సైబరాబాద్‌లో 1,241, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 517 కేసులు నమోదయ్యాయి. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు రడిపే వాళ్ల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించారు. శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించి మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలగానే వెంటనే వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు 265 బృందాలుగా ఏర్పడ్డారు. పలుచోట్ల తనిఖీలు నిర్వహించి, ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో పనిచేసి బదిలీపై వెళ్లిన సిఐలను సైతం తనిఖీల కోసం పిలిపించారు. కాగా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికీ ట్రాఫిక్ పోలీసులు షాకిచ్చారు.తాగి డ్రైవింగ్ చేసిన కేసుల్లో 938 ద్విచక్ర వాహనాలు, 21 ఆటోలు, 275 కార్లు, 7 భారీ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**న్యూఇయర్ రోజున నెత్తురోడిన రహదారులు..**
కొత్త సంవత్సరం వేడుకల వేళ పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు కొన్ని కుటుంబాల్లో విషాదం నింపాయి. పోలీసులు న్యూ ఇయర్ రోజున ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పలు చోట్ల ప్రమాదాలు పలువురి ప్రాణాలు బలి తీసుకున్నాయి. న్యూ ఇయర్ రోజున ఆ కుటుంబాలకు తీరని దు:ఖాన్ని మిగిల్చాయి. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి కాలనీలో కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మోతినగర్‌కు చెందిన అరుణ్ అనే వ్యక్తి మిత్రాహిల్స్ నుంచి హైదర్‌నగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన స్కోడా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అరుణ్ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి కారు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. నగర శివారులో ఆదిభట్ల పరిధిలోని బొంగ్లూర్ వద్ద ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డుపై ద్విచక్రవాహనం అదుపుతప్పి అనిల్‌కుమార్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.సూర్యాపేటలో లారీ, కారు ఢీకొన్ని ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి.ఈ ఘటనలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన నట్‌రాజ్ మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు మృతి చెందాడు. మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపి ఒక వ్యక్తిని ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. మద్యం మత్తులో ఉన్న వాహనదారుడిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇలా కొత్త ఏడాదికి ఎంతో సంబురంతో స్వాగతం పలకాల్సిన వేళ పలువురు రోడ్డు ప్రమాదాల్లో తమ ఆత్మీయులను కోల్పోయి తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

# కొంగొత్త ఆశలతో.. ఆధ్యాత్మిక బాట

**సందర్శకులతో కళకళలాడిన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు**

**కొత్త ఏడాదికి కనువిందుగా స్వాగతం**



హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త : నగరవాసులు డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి న్యూ ఇయర్ వేడుకలను ఎంజాయ్ చేశారు. 2024లో తొలిరోజు ఉదయాన్నే ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో పర్యాటక ప్రాంతాల్లో విహరించారు. ఫొటోలు తీసుకుంటూ ముచ్చటపడ్డారు.నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం నగరంలోని ఆలయాలు కిటకిటలాడాయి.కొత్త సంవత్సరం అంతా మంచి జరగాలని కోరుతూ వేకువజాము నుంచి ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కొత్త ఏడాది ఆరోగ్యాన్ని, సంతోషాన్ని ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు..మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తడంతో ఆలయాల ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

సోమవారం రాష్ట్ర ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించడంతో జనం భారీగా ఆలయాలకు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కొత్తపేట, గ్రీన్‌హిల్స్ కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయం, బిర్లా టెంపుల్, చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి టెంపుల్, సంఘీ టెంపుల్, నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ ఆలయం, జూబ్లీహిల్స్ పెద్దమ్మ టెంపుల్, ఇస్కాన్ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం, ఫిలింనగర్‌లోని పలు ఆలయాల వద్ద ఉదయం నుంచే భారీ క్యూలు కన్పించాయి. ఇక ఆలయ నిర్వాహకులు భారీకేడ్లు ఏర్పాటు చేసి క్యూలను నియంత్రించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను ఆలయానికి కిలోమీటర్ దూరంలోనే నిలిపివేశారు.ఇక న్యూఇయర్ వేడుకల సందర్భంగా బిర్యానీ హోటళ్ళ, బేకరీలు కిటకిటలాడాయి. గతేడాదితో పోల్చితే 2024 కోసం భారీ ఎత్తున



కేక్‌లు కట్ చేశారు.

గతంలో జరిగిన ప్రమాదాలు, ఘటనల్ని దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లతో పాటు హుస్సేన్‌సాగర్, పివి నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేలలోని ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు వాహన చోదకుల వేగాన్ని నియంత్రించారు.

# ఆధునిక బానిసత్వాన్ని మోడీ సృష్టించారు

- **2024 సంవత్సరాన్ని కార్మికుల పోరాటాల సంవత్సరంగా ప్రకటన**
- **కార్మిక సంఘాల నేతలు మండిపాటు**



సైఫాబాద్, జనవరి 1 ప్రభాతవార్త: దేశంలోని కోట్లాది మంది కార్మికులకు సంపూర్ణ సంక్షేమాన్ని అందించి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక కోడ్‌లను తీసుకువచ్చి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆధునిక బానిసత్వాన్ని సృష్టించిందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు. దేశంలోని కార్మిక వర్గం అనేక సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటున్నదని 2024 సంవత్సరాన్ని కార్మికుల పోరాట సంత్సరంగా ప్రకటిస్తున్నామని, కార్పోరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక నిరంకుశ మోదీ పాలనను అధికారం నుంచి ఓడించాలని నేతలు కార్మికులు, ప్రజలకు పిలుపునిచ్చారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మెళనం నిర్వహించింది. ఈ సమ్మెళనంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వర్‌రావు, టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, ఎఐటియుసి ఉపాధ్యక్షులు పి.ప్రేమ్‌పావని, బి.చంద్రయ్య, కార్యదర్శులు ఒరుగంటి యాదయ్య, నందూరి కరుణకు మారి 103 వసంతాల చారిత్రక ఎఐటియుసి రూపొందించిన నూతన సంవత్సరం డైరీ-2024ను ఆవిష్కరించారు.

# భక్తులతో కిటకిటలాడిన టిటిడి

సైఫాబాద్, జనవరి 1 ప్రభాతవార్త: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంకు సోమవారం వేలాది మంది భక్తులు విచ్చేశారు. నూతన వస్త్రాలను ధరించిన భక్తులు భక్తి శ్రద్ధలతో గోవిందనామాలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పాల్గొన్నారు. ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులకు ఏలాంటి అసౌకర్యం ఏర్పడకుండా సబ్బంది అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. దేవాలయంలో తెల్లవారు ఝామున శ్రీవారికి తిరుప్పవై, శుద్ధి, తోమాల సేవ, అర్చన తదితర కార్యక్రమాలను ఘనంగా జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. టిటిడి డిప్యూటి ఈవొ రమేష్‌బాబు, ఉద్యోగులు, సిబ్బంది సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అజహారుద్దీన్



హైదరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహ్మద్ అజారుద్దీన్ సోమవారం సిఎం రేవంత్‌రెడ్డిని డా.బిఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సిఎంతోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీత్కలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిపిసిపి ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ ఫహీం, కాంగ్రెస్ నేత అసదుద్దీన్ కూడా ఉన్నారు.

# బిర్యానీ ఉడకలేదని ప్రశ్నించినందుకు హోటల్ సిబ్బంది దాడి



హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త : నగరంలోని ఓ హోటల్‌లోని బిర్యానీ విషయంలో తలెత్తిన గొడవ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. నూతన సంవత్సరం సందర్భంగా ధూల్‌పేట్‌కు చెందిన కొందరు వ్యక్తులు రాత్రి అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో బిర్యానీ తిందామని వెళ్లారు. డైనింగ్ టేబుల్‌పై కూర్చొని మటన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అయితే, ఆ బిర్యానీలోని మటన్ సరిగ్గా ఉడకలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దానికి తాము పూర్తి డబ్బులు చెల్లించలేమని హోటల్ వెయిటర్లతో వినియోగదారులు గొడవకు దిగారు. అయినా హోటల్ సిబ్బంది పట్టించుకోక పోవడంతో తాము పూర్తి డబ్బులు చెల్లించమని హోటల్ వెయిటర్లతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరు గ్రూపులు వాదించుకున్నారు. వాగ్వాదం కాస్త గొడవకు దారి తీసింది. హోటల్ వెయిటర్లపై దాడికి దిగడంతో.. వెయిటర్లు కస్టమర్లపై కర్రలతో దాడి చేశారు. రక్తాలు వచ్చేలా కస్టమర్లను వెయిటర్లంతా కలిసి కొట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గొడవను సద్దుమనిపించే ప్రయత్నం చేశారు. కస్టమర్లకు తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. హోటల్ యజమానిపై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన ముగ్గురు వెయిటర్లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇక, విషయం తెలుసుకున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వెంటనే స్పందించి అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి గ్రాండ్ హోటల్ వెయిటర్లు, యజమానిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో హోటల్‌కు నిప్పు పెడతామని ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు.

**సమాజానికి కవులే**
# మార్గ దర్శకులు

మలక్‌పేట్, జనవరి 1 ప్రభాతవార్త: సమాజానికి కవులే మార్గ దర్శకులని రాష్ట్ర ఎస్‌సీఎస్ కోర్టు సీనియర్ సూపరింటెండెట్ పివీవీ అంజనికుమారి పేర్కొన్నారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆద్వర్యంలో నగరంలో నిర్వహించిన సీని గానలహరి, జాతీయ సాహితి కళా సేవా ప్రతిభాపురస్కారాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సాహితి వేత్తలు, కళాకారులు సమాజంలో అంత్యం కీలక మైన వ్యక్తులలని, సమాజాన్ని మార్చగల శక్తి వారికి మాత్రమే ఉందన్నారు.

## ఆంగ్ల నూతన సంవత్సరంలో
# ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి


శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

బేగంపేట జనవరి 1,ప్రభాతవార్త : ఆంగ్ల నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ మాణిక్యాలమ్మ అమ్మ వార్ల ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మ వార్ల అనుగ్రహం, ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఆయన సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని దర్శించుకున్నారు.ముందుగా ఆలయ పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు.అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేసారు.వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.పలువురు ఆలయ కమిటీ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణా శ్రీనివాస్ గౌడ్,అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్,కొసికె కిరణ్మయి,కిషోర్,సభ్యులు మహేష్ యాదవ్,మహేందర్,కిషోర్,గౌరీ శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల
# సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమతం యాదగిరి

హైదరాబాద్, జనవరి 1 ప్రభాతవార్త: గత బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం అంబర్‌పేట నియోజవర్గంలోని గోల్నాక అడ్డ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమశక్తిపై ఆధారపడి జీవిస్తున్న భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, వర్తింపజేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఇళ్ళులేని కార్మికులకు ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటిలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గణేష్, కాశయ్య, సి.హెచ్.శ్రీనివాస్, సహదేవ్, లింగస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ బ్రాహ్మణ సేవాసంఘం
# క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద



పేట్‌బషీరాబాద్, జనవరి 1, ప్రభాతవార్త : పేట బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన క్యాలెండరన్ సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కెపి వివేకానంద చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. అనంతరం వేదపండితులు ఎమ్మెల్యే వివేకానందకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల, కులాల అభ్యున్నతికై పనిచేసి వారికి సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేశామన్నారు. రాన్ను రోజుల్లో కూడా బ్రాహ్మణులకు అన్ని విధాలుగా నావంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, ప్రధాన సలహాదారులు, సీనియర్ జర్నలిస్టు సర్వేపల్లి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నిట్టల వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి సంజీవరావు, ఉపాధ్యక్షులు శ్రీరామశర్మ చక్రధారి, గడ్డం రాంబాబు, కార్యదర్శులు సాయిరాం, శ్రీధరాచార్యులు, రాధాకృష్ణశర్మ, అచ్యుత్ ఫణీంద్ర, లక్ష్మి కుమారి, మాలతి శ్రీనివాస్, అంజలి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

## 91 వసంతాలు
# తెలుగు సినిమాకు జైజైలు వీసీడీ ఆవిష్కరణ


91 వసంతాల తెలుగు సినిమాకు జైజైలు' గేయ రూపక వీసీడీని ఆవిష్కరిస్తున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చిక్కడపల్లి, జనవరి 1 ప్రభాతవార్త: సమీకృత (అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో రూపొందించిన '91 వసంతాల తెలుగు సినిమాకు జైజైలు' గేయ రూపక వీసీడీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఇట్‌క్లా 29వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు సినిమా వీరాభిమాని, చిత్ర అభినందన విశ్లేషకులుగా, లఘు, డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాత, తెలుగు చిత్రసీమ కీర్తి పతాక తేజస్సేను తెలిపే విభిన్న కార్యక్రమాలను, 62 వసంతాలుగా, దేశవిదేశాలలో వేలాది కార్యక్రమాలను నిర్వహించిన చరిత్ర డాక్టర్ కె.ధర్మారావుకు ఉందన్నారు. తొలి వీసీడీని శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణకు అందించారు. కార్యక్రమంలో ఇట్‌క్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రావు, లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, హస్తకళా స్రష్ట పి.కమలప్రసాద్‌రావు, డాక్టర్ పి.విజయకుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పూర్వ జీఎం ప్రసాద్ సూరపనేని తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



నార్సింగి, జనవరి 1 ప్రబాతవార్త : గండిపేట మండలంలోని ఖానాపూర్, హైదర్షాకోట్ గ్రామాలలో హిందూ సంఘాల ప్రతినిధులు శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. పిల్లలు, పెద్దలు, వృద్దులు అంతా పుర వీధులలో జైశ్రీరాం... జైజై శ్రీరాం... అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి అక్షింతలను పంచిపెట్టారు. లక్ష్మీనారాయణ, సురేష్, రాజు తదితరులు మాట్లాడుతూ ఈ నెల 22.వ,తేదీన అయోధ్య రామ మందిరంలో హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట ఉందని, దాన్ని అందరూ టీవీలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తప్పకుండా చూడాలని తెలిపారు. అలాగే ప్రతీ ఇంట్లో 5.దీపాలు వెలిగించి శ్రీరాముడికి నమస్కరించాలన్నారు. ఇప్పుడు ఇంటింటికి తిరిగి పంపిణీ చేసిన అక్షింతలను తమ ఇళ్లల్లో పూజ గదుల్లో పెట్టుకొని, పెళ్లిళ్ల జరిగితే వీటిని ఇతర అక్షింతలలో కలిపి నవ దంపతులను ఆశీర్వదించాలని సూచించారు. శ్రీరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పిల్లలు, పెద్దలు పాల్గొని ఆ దేవదేవుడి కరుణా,కటాక్షాలకు పాత్రులయ్యారు.

## శ్రీవారి ఆలయానికి భక్తుల తాకిడి

చిక్కడపల్లి, జనవరి 1 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని 2024 నూతన సంవత్సరంను పురస్కరించుకుని సోమవారం పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం దృష్ట్యా ఆలయం అధికారులు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు వివరించారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన తలసాని సాయికిరణ్ యాదవ్

కంటోన్మెంట్, జనవరి 1 ప్రభాతవార్త: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును కేటీఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కేటీఆర్‌కు పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న బండి అభిషేక్ ముదిరాజ్ తదితరులు

సికింద్రాబాద్, జనవరి 1 ప్రభాతవార్త : నూతన సంవత్సర సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి అభిషేక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పేదలకు నూతన దస్తులను పంపిణీ చేశారు. చిలకలగూడ గాంధీవిగ్రహం వద్ద సోమవారం దుస్తుల పంపిణీ కార్యాక్రమాన్ని చేపట్టారు. ముందుగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు ఈ కార్యాక్రమంలో పాపలాల్, వాహిద్, దేవేందర్‌రెడ్డి, కిషోర్, సాయిమధుకర్, రవి, వెంకట్, నాని, శ్రీను, గౌస్, సతీష్, శ్యామ్, ఇమాన్యుల్, అన్విత్, జగత్‌రెడ్డి, సందీప్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సందర్శకుల హక్కులకు భంగం కలగొద్దు


వినతిపత్రం సమర్పిస్తున్న హరిబాబు

కంటోన్మెంట్, జనవరి 1 ప్రభాతవార్త : నాంపల్లి ఎగ్జిబీషన్‌లో సందర్శకుల, కొనుగోలుదారును వ్యాపారులు, నిర్వాహకులు గౌరవించాలని, వారి హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా చూడాలని వినియోగదారులు హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు ఎగ్జిబీషన్ సొసైటీ కార్యాలయంలో సెక్రటరీ బి.హనుమంతరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యాక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. శివకుమార్, వి.రవి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆకుల కవిలత, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు చొల్లెటి రమేష్ తదితరుల పాల్గొన్నారు.

# సమాజంలో ప్రైవేట్ సెక్యూరిటీల పాత్ర ఎంతో గొప్పది

**ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**

చిక్కడపల్లి, జనవరి 1 ప్రభాతవార్త: సమాజంలో ప్రైవేట్ పబ్లిక్ ఆస్తులను రక్షించడంలో ప్రైవేట్ సెక్యురిటీల సేవలు మరువలేనివని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రముఖ వ్యాపారవేత్త, సాయిగ్రూప్స్ అధినేత డిఎస్.రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో ప్రైవేట్ సెక్యూరిటీ కీలకంగా మారిందని అన్నారు. అపార్ట్‌మెంట్ నుంచి మొదలుకుని ఏటీఎంబ్యాంక్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ ఆస్తులను సెక్యూరిటీ రక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షలు దేశవ్యాప్తంగా కోటిపైచిలుకు సెక్యూరిటీలు పనిచేస్తున్నారని అన్నారు. ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగ కల్పన కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సెక్యూరిటీ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు మురహరిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, టికెఎం.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి


మారేడ్‌పల్లి సుబ్రమణ్యస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, సంతోష్ యాదవ్, చొల్లేటి

అడ్డగుట్ట,జనవరి 1 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, చొల్లేటి రమేశ్, తుకారాంగేట్ మీనా ఆసుపత్రి ఎండి డాక్టర్ ఉమాకాంత్‌లు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో జరిగిన పూజా వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సి.సంతోష్ యాదవ్, ధర్మకర్తలు, భాస్కర్, నర్సింగ్‌రావ్, గుజ నాగేందర్ యాదవ్, అలయ ప్రధాన అర్చకులు టీ.రాజేశ్వర శర్మ,యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపిన బల్కంపేట

**ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు**

సంజీవరెడ్డి నగర్, జనవరి 1, ప్రభాతవార్త : మాజీ మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సోమవారం బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు ముచ్చర్ల ఆంజనేయులు మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.ఆంటోని, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కట్ట బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వకుళాభరణం శుభాకాంక్షలు

నాంపల్లి, జనవరి 1 ప్రభాతవార్త : సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని 6వ అంతస్తులో తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సరం 2024 శుభాకాంక్షలు తెలిపారు.

## మైనంపల్లి హనుమంతరావుకు శుభాకాంక్షలు



నిజాంపేట్, జనవరి 1, ప్రభాతవార్త : నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మైనంపల్లి హనుమంతరావుని, కొలను హనుమంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అన్ని డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరు ఆయురారోగ్యాలతో పాటు సకల విజయాలను అందించాలని కొలను శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు.

## బేతాళ ప్రేయర్ చర్చీలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

జీడిమెట్ల, జనవరి 1, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్‌లో బేతాళ ప్రేయర్ చర్చిలో సోమవారం ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర కార్మిక నాయకులు చింతల నాగరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. క్రిస్టియన్ సోదరులకు ఏదైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అంతేకాకుండా ఆ యేసు ప్రభు దీవెనలు ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్చీ పాస్టర్ మార్క్, సంఘం పెద్దలు కుమార, రమణ, దుర్గారావులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్, గణేష్‌చారి తదితరులు

చిక్కడపల్లి, జనవరి 1 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్‌కు తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బాలగౌని బాలరాజ్‌గౌడ్, బీసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ కుందారం గణేష్‌చారిలు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయాలని కోరారు.

## నగర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద నూతన సంవత్సర వేడుకలు


కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న సిపి శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్, జనవరి 1 ప్రభాతవార్త :హైదరాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చారిత్రక చార్మినార్ వద్ద నూతన సంవత్సరం వేడుకలు జరిగాయి.నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నగర అదనపు పోలీస్ కమిషనర్లు రంగనాథ్,విశ్వ ప్రసాద్,దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య,అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్,చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్,చార్మినార్ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బేగంపేట జనవరి 1,ప్రభాతవార్త : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.సోమవారం ఉదయం నుంచి అమ్మ వారిని దర్శించుకునేందుకు జంట నగరాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి రావడంతో ఆలయం భక్తుల రద్దీతో నిండిపోయింది.ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయంలో ముందస్తు ఏర్పాట్లు చేసారు.ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగింది.ఈ సందర్భంగా ఆలయంలో తీర్థ ప్రసాదాలను అందజేసారు.

# 'కొంగర జగ్గయ్య స్మారక అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 1 ప్రభాతవార్త: శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటులు, పద్మభూషణ్, కళావాచస్పతి డాక్టర్ కొంగర జగ్గయ్య జయంతి సందర్భంగా వివిధ రంగాల ప్రతిభామూర్తులకు 'కొంగర జగ్గయ్య స్మారక అవార్డుల ప్రదానోత్సవం' కార్యక్రమం సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో నిర్వాహక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బి.రాంచందర్‌రావు, రఘుశ్రీ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా నేటినిజం పత్రిక ఎడిటర్ బైస దేవదాస్ హాజరై పురస్కారాలను ప్రముఖ సినీనటులు ఆనందచక్రపాణి, ప్రముఖ కవి, సినీనటుల మాయకుంట్ల నారాయణరెడ్డిలకు అందించారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లలితవాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీకవి మౌనశ్రీ మల్లిక్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షుడు రాధా కుసుమ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బహుభాషా కవిసమ్మేళనం జరిగింది.



చర్చిలో ప్రత్యేక ప్రార్థలను నిర్వహిస్తున్న పాస్టర్లు సుమంత్, అధ్యక్షులు లూథర్

## చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

తార్నాక, జనవరి 1 ప్రభాతవార్త: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శాంతినగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వందలాది మంది క్రైస్తవులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సమంత్‌కుమార్, అధ్యక్షులు మార్టిన్ లూథర్, కార్యదర్శి డేవిడ్ రాజ్, కోషాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షుఉ మనష్షే, సహాయకార్యదర్శి ఎం.పాల్,సహాయకోషాదికారి రిచర్డ్ సన్, ఇంచార్జీలు లూథర్‌లీ, మౌజోస్, సునీర్, ప్రేమ్‌కుమార్,ఆనంద్, సత్యానందంతో పాటు వందలాదిగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థలలో పాల్గొన్నారు.

**విజయపురి కాలనీ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు...ప్రత్యేక ప్రార్థనలు**

విజయపురి కాలనీ సౌత్‌లాలాగూడలోని బాప్టిస్ చర్చ్‌లో కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా సోమవారం ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిలో ప్రార్థనలతో పాటు ప్రత్యేక భక్తి గీతాలు పాడారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ పి.జీ ప్రకాశం, పాస్టర్ రెవ.డా.విల్సన్ పాల్, ప్రసిడెంట్ పురుషోత్తం, కార్యదర్శి విక్టర్ నవీన్ కుమార్, కోషాది కారి డా. టి.ఏసుపాదం, ఉపాధ్యక్షులు కే.జే జాషువా, జాయింట్ సెక్రటరీ జాన్సన్ పాకాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా సత్యమూర్తి దస్తూరి తెలుగు ఫాంట్ ఆవిష్కరణోత్సవం


సత్యమూర్తి తెలుగుఫాంట్‌ను ఆవిష్కరిస్తున్న కొండలరావు, పద్మనాభరావు, పురుషోత్త్‌కుమార్, లంక, తదితర

రవీంద్రభారతి, జనవరి 1 ప్రభాతవార్త : సత్యమూర్తి జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లోనూ కార్టూన్‌లకు ప్రసిద్ధిగా విశ్వవ్యాప్తంగా గొప్ప కార్టూనిస్టుగా ఖ్యాతినార్జించారని దూరదర్శన్ మాజీ అడిషనల్ డీజి డా. ఆర్.అనంతర పద్మనాభరావు అన్నారు. ఆయన ఎన్నో ప్రముఖ పత్రికల్లో వెయ్యనటువంటి కార్టూను లేదంటే అతిశయోక్తి కాదన్నారు. కార్టూన్లు అన్ని సందర్భాల్లోనూ మనకి వినోదాన్ని, మనఃశాంతిని కలిగించే నవ్వుపెట్టె వంటివని, సత్యమూర్తి దాంపత్య జీవితంలోని సొబగుల్ని, రహస్యాలను, కుటుంబ సంబంధిత సమస్యలు, కోణాలను కార్టూన్ల రూపంలో ప్రతీఒక్కరికీ సులువుగా అర్థమయ్యేరీతిలో చూపించి నవ్వుల పువ్వులు వికసింపజేసి కురిపించి తన్మయుల్ని చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సారిపల్లి కొండలరావు సారధ్యంలో యువకళావాహిని ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ కార్టూనిస్టు, ప్రచార చిత్రకారుడు బి.వి.సత్యమూర్తి 85వ జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది

## టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీని కలిసి విద్యుత్ అకౌంట్స్ అధికారులు


సిఎండీకి పుష్పగుచ్చం అందజేస్తున్న అంజయ్య, వీరస్వామి, వెంకటేశ్వర్లు

హైదరాబాద్, జనవరి 1,ప్రభాతవార్త: విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేష్ ఆఫ్ తెలంగాణ (విఏవోఏటి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీ బాధ్యతలు స్వీకరించిన ముషారఫ్ ఫారుఖీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా సిఎండీ మాట్లాడుతూ సంస్థమనుగడకు ఉద్యోగులందరూ కష్టపడి పనిచేసి వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కంపెనీ ప్రెసిడెంట్ డి.వీరస్వామి, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, స్టేట్ ఫైనాన్స్ సెక్రటంరీ పి.అనిల్, వి.పరమేష్, మురళయ్య, హరీష్‌కుమార్, జానయ్య, బి.శ్రీనివాస్, నాగరాజు, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

Know all men by these presents that our clients **A. Radha Kumari, W/o Late A. Siva Rama Krishna,** R/o. H.No.1-16-123/1, 2nd Floor, Sainagar Colony, Opp Lane to Reliance Fresh, Alwal, Tirumalagiri, Hyderabad-500 010; Akkapeddi Suresh, S/o Late A. Siva Rama Krishna, R/o H.No.1165/a, Risala Bazar, Bolaram Cantonment, Tirumalagiri, Hyderabad-500 010 and A. Vijay Lakshmi, D/o Late A. Siva Rama Krishna, R/o. H.No.1-16-123/1, 2nd Floor, Sainagar Colony, Opp Lane to Reliance Fresh, Alwal, Tirumalagiri, Hyderabad–500 010, on death of Sri A. Siva Rama Krishna on 10-02-2010, had filed a suit to Declare them as Legal heirs of Sri A. Siva Rama Krishna vide O.S.No.1030 of 2023 before XI Junior Civil Judge, City Civil Court at Secunderabad.

Therefore, our client hereby calls upon the general public and to any and all person(s) who have any objections or claims or any interest adverse to the claim of our client that they may appear before the Hon'ble Court on next date of hearing i.e. **04-01-2024 at 10:30 AM** and stake adverse claim. If there are No objections, the Hon'ble Court will be pleased to proceed further and allow the claim of our client. Hence, this notice to one and all.

**Sd/- M/s L.A. JAN**
**ADVOCATES & ASSOCIATES**
#12-13-372, Street No.2, Tarnaka,
Secunderabad-500 020
**Cell: 94942 53600**

